క్లుప్తంగా

పేదలకు అన్నదానం



గురజాల: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని వైద్యుడు బొప్పన శ్రీహర్ష అన్నారు. స్థానిక పాటపాటేశ్వరమ్మ దేవాలయంలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు, యాచకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం, బండి రవికుమార్, గంధం చిన్నా, వందనం మల్లిఖార్జునరావు, చింతపల్లి కొండలు, కనకం హనుమంతరావు తదితరులున్నారు.

ముగిసిన క్రీడా సంబరాలు

గురజాల: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకుని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా సంబరాలు సోమవారం రాత్రితో ముగిశాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి పరిటాల సీసీ పెదకూరపాడు, రెండవ బహుమతి థామస్ సీసీ గురజాల, మూడవ బహుమతి విక్టరీ బాయ్స్ సీసీ మాచర్ల, నాలుగో బహుమతి హనుమాన్ సీసీ దాచేపల్లిలు కైవసం చేసుకున్నాయి. విజయం సాధించిన జట్లుకు వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ బహుమతులు, షీల్డ్‌లు అందించారు. అక్కినపల్లి సైదులు చిరంజీవి, చంద్రారెడ్డి, తదితరులున్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

– జిల్లా వ్యవసాయాధికారి మురళీ

గురజాల: దుకాణాల్లో రైతులకు ఏరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ హెచ్చరించారు. మండల పరిధిలోని పలు పురుగు మందులు, విత్తనాల దుకాణాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల్లో ఉన్న ప్రతి ఒక్క కంపెనీ నుంచి పొందే వస్తువుకు విధిగా ఫామ్ సి, పిసిలు పొందిఉండాలన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే దుకాణంపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతుమిత్ర సీడ్ సెంటర్ నందు గల స్టాక్ రూ.3,76,500లు విలువ గల స్టాక్‌ను నిలుపుదల చేసినట్లు తెలిపారు. రైతులు కూడా దుకాణాల్లో చిన్న ప్యాకెట్ కొనుగోలు చేసినా రశీదు పొందాలన్నారు. ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో ఉపశమనం



మాచర్ల: పట్టణంలోని ఉదయం 9.30 నుంచి 10.30 వరకు మంగళవారం భారీస్థాయిలో వర్షం కురిసింది. మొదట ఎండగా ఉన్న వాతావరణం ఆకస్మికంగా మారిపోయింది. మబ్బులు పట్టి ఈదురు గాలులతో మొదలై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. రోహిణికార్తె ఎండలతో మండిపోతున్న జనం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షం వలన బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, 24వ వార్డు, రింగురోడ్డు, కిడ్స్ పాఠశాల ప్రాంతంలో వర్షపునీరు చేరింది. గాలి దుమారం, వర్షం వలన పలు చోట్ల చెట్లు పడిపోగా విద్యుత్ వైర్లు తెగి సరఫరా నిలిచిపోయింది. ఉదయం 10గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనంతరం విద్యుత్ అధికారులు మరమ్మతులు చేశారు. మొత్తంగా రోహిణి కార్తె సెగ నుంచి ప్రజలు ఉపశమనం పొంది ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా దేవాలయాల వార్షికోత్సవం



పిడుగురాళ్ల రూరల్: మండలంలోని కామేపల్లి గ్రామంలో బైపాస్ పక్కన వేంచేసియున్న విఘ్నేశ్వర దేవాలయం, గ్రామంలో వేంచేసియున్న కాశీవిశ్వనాథుని దేవాలయ 10వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివార్లు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. విచ్చేసిన భక్తులకు స్వామివార్ల తీర్ధ ప్రసాదాలు అందించారు. విచ్చేసిన వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, సమావేశానికి కౌన్సిల్ సభ్యులందరు హాజరు కావాలని కోరారు.

ప్రజలంతా సీఎం జగనన్న వైపే

- చంద్రబాబు కపట నాటకాలకు కాలం చెల్లింది
- నాలుగేళ్ల పాలన సంబరాల్లో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కేక్ కట్ చేసి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: చంద్రబాబు నాయుడు 600 హామీలలో వేటిని అమలు చేయనందుకే ప్రజలు ఆనాడు గట్టిగా బుద్ధి చెప్పారని, మళ్లీ మరో నాటకానికి తెరతీసినా, ప్రజలు ఆ జిమ్మిక్కులను నమ్మే స్థితిలో లేరని ప్రభుత్వ విప్, జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కారెంపూడిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలన సంబరాలను కారెంపూడిలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే కేక్ కట్ చేశారు. బాణా సంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసిన నాయకులు, ప్రజలు సంబరం చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసి ఎన్నికలలో ఇచ్చిన దాదాపు 99 శాతం హామీలను నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని గెలుచుకుందన్నారు. కరోనా లాంటి కష్టకాలం రెండేళ్లు ఎదురైనా కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పరిస్థితులు అనుకూలించకున్నా కూడా దాదాపు రూ.2.10 లక్షల కోట్లు ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి కూడా రూ. 2 లక్షలు నుంచి 3 లక్షలు లబ్ధి చేకూర్చారన్నారు. 2014 ఎన్నికలలో టీడీపీ ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని స్పష్టంగా ప్రజలకు చెప్పగలుగుతున్నామని, మాది అన్ని వర్గాల క్షేమం కోరే ప్రభుత్వమన్నారు. రాబోయే కాలంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈబీసీ ఇతర అన్ని వర్గాలను ఆదుకునే దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. గోబెల్స్ ప్రచారాలతో తప్పుడు ఆరోపణలతో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా మళ్లీ ఇప్పుడు హామీలతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు తయారయ్యారన్నారు. రాష్ట్ర ప్రజలు ఎంతో చైతన్యవంతులని, చంద్రబాబు మోసకరమైన వాగ్దానాలపై అందరికీ అవగాహన ఉందన్నారు. నాలుగేళ్ల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపించారని ప్రభుత్వ విప్ పీఆర్కే స్పష్టం చేశారు. నాలుగేళ్ల పండుగ సందర్భంగా పార్టీ నాయకులు కేడర్ ప్రజలతో కలసి ప్రభుత్వ విప్ పీఆర్కే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికలు పేదలకు పెత్తందార్లకు మధ్య జరిగే పోరని ఈ పోరులో పేదలదే విజయమన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ గుండెబోయిన అమృతలక్ష్మి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, సర్పంచ్ ప్రమీలాభాయి తేజానాయక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో నాలుగేళ్ల పాలన సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్



పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఎకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ఏకతాటిపై నడిపిస్తూ రాష్ట్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, కౌన్సిలర్లు అజ్మీర శారద, గర్నె నాగేశ్వరరావు, మాదాల కిరణ్ కుమార్, పసుపులేటి ఆనంద్‌బాబు, కాంట్రకుంట శ్రీనివాసరావు, జూలకంటి శ్రీనివాసరావు, నాయకులు కత్తెరపు రాంగోపాల్‌రెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఎండీ అలీం, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: పేదల కష్టాలు గుర్తించి వారికి ఏ లోటు రాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అన్నారు. కారెంపూడిలో ఐదవ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించి ఇందిరానగర్ కాలనీ వరకు ప్రతి గడపకు ఎమ్మెల్యే పీఆర్కే వెళ్లారు. ప్రతి గడపలో కుటుంబ సభ్యులను పలకరించి వారి బాగోగులు తెసుకున్నారు. ఇప్పటివరకు గడచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించారు. వారు చెప్పిన సమస్యలు విని తక్షణమే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గడపలో పీఆర్కేకు ఆత్మీయ స్వాగతం లభించింది. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.2.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రానున్న రోజుల్లో కూడా సంక్షేమ పథకాలు కొనసాగించి పేదల అభ్యున్నతికి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి నివేశన స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వడం ఖాయమని, అలాగే ప్రతి గడపలో అర్హులైన పేదలందరికి నవరత్న పథకాలు పాదదర్శకంగా కుల మత పార్టీలకు అతీతంగా అందిస్తామన్నారు. పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పీఆర్కే ప్రజలకు స్పష్టంగా వివరించారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ గుండెబోయిన అమృతలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రమీలాబాయి తేజానాయక్, ఎంపీటీసీ అంతరగడ్డ ఏసోబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ ఖాసిం, గుండెబోయిన శివ, దినకర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, పాతూరి రామిరెడ్డి, ఆళం విజయభాస్కరరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, నాయకులు మిద్దెపోగు పున్నయ్య, మిద్దెపోగు విజయ్, కాల్వ ప్రభుదాసు, కటికల రవికుమార్, ఆర్యవైశ్య సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

పిడుగురాళ్ల: సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో నిర్వహించారు. ముందుగా జెండా విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక హక్కులకోసం నిరంతర పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం గుంటూరు బస్‌షెల్టర్ సమీపంలో అమరులైన కార్మిక నాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు షేక్ బాబు, ముక్కంటి, రాఘవులు, కనకారావు, లింగయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

చిలకలూరిపేటటౌన్: బాల్య వివాహాలు పిల్లల హక్కులను ఉల్లంఘిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.సామ్రాజ్యం చెప్పారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో మంగళవారం ఆజాద్ ఎంపీపీఎస్ స్కూల్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు, ఏఎన్ఎంలు, మహిళా కానిస్టేబుళ్లకు బాల్య వివాహాల నిషేధం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో మహిళలకు దీర్ఘకాలిక సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలకు కారణాలైన మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ అప్పాపురం రమేష్, స్కూల్ హెచ్ఎం వి నాగమల్లేశ్వరాచారి పాల్గొన్నారు.

రేపటిలోగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి

నాదెండ్ల: మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 138 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్న విషయం విదితమే. జూన్ 1వ తేదీ వరకూ తమ లాగిన్‌లో దరఖాస్తుల సమస్యలు ఉన్నట్లయితే గ్రీవెన్స్ చేసుకోవచ్చని ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీలు పొందేందుకు 61 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. 21 మంది లాంగ్ స్టాండింగ్ కాగా, మరో 22 మంది సర్‌ప్లస్, మరో 18 మంది రిక్వెస్ట్ కేటగిరిల్లో, ఉన్నత పాఠశాల పరిధిలో 77 మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు.

పిడుగు పాటుకు బలైన జీవాలు

యడ్లపాడు: పిడుగు పాటుతో 9 జీవాలు మృతి చెందాయి. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన జీవాల పోషకులు మంగళవారం తమ మేకల్ని, గొర్రెల్ని తీసుకుని గ్రామ సమీపాన ఉన్న ప్రత్తిపాడు -కొప్పర్రు గ్రామల మధ్య పొలాలకు తీసుకెళ్లారు. ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. దీంతో మందలోని కొన్ని జీవాలు చీలి పొలంలోని ఓ చెట్టువద్దకు చేరాయి. ఇంతలోనే పెద్దశబ్దంతో ఆ చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు చెంతనే ఉన్న 9 జీవాలు అక్కడి క్కడే మృతి చెందాయి. వాటిలో యలగాల నాగ రాజుకు చెందిన 4 జీవాలు, సాయిబాబు, పున్నా రావు, శ్రీను, పరమేశ్వరరావు, శివకోటేశ్వరరావుకు చెందిన ఒక్కొక్కటీ ఉన్నాయని తెలిపారు.

పిడుగు పాటుకు ఆవు, ఎద్దు మృతి

బొల్లాపల్లి: అకాలవర్షంతో పిడిగు పడి ఎద్దు, ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని లింగంగుంట తండాలో మంగళవారం జరిగింది. సేకరించిన వివరాలప్రకారం తండాకు చెందిన బూక్యా బావర్ది నాయక్‌కు చెందిన ఆవు, ఎద్దులు మేత కోసం పొలం వెళ్లగా ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో రెండు మూగ జీవాలు మృత్యువాతపడ్డాయని తన పొలంలో ఇటాంటి సంఘటన జరుగటంతో బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. వాటి వెంట ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. రెండింటి విలువ సుమారు లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

ట్రాక్టర్, బైకు ఢీకొని ఒకరు మృతి

మరొకరికి గాయాలు



మృతిచెందిన చల్లా కాశిరెడ్డి



ట్రాక్టర్ బైకు ఢీ కొన్న ప్రదేశం

మాచర్ల రూరల్: ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ కొనటంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన మండలంలోని జమ్మలమడక గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జమ్మలమడక గ్రామానికి చెందిన చల్లా కాశిరెడ్డి (43), గాదె వెంకట్రామిరెడ్డిలు మాచర్లలో పనులు ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులోని గోశాల దగ్గరకు రాగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న చల్లా కాశిరెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక ఉన్న గాదె వెంకట్రామిరెడ్డికి కాలు విరగడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం నర్సరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం, దమ్మాలపాడు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. పథకం నిర్వహణకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే గ్రామసభలో ప్రస్తావించవచ్చని కోరారు. ఆయా గ్రామసభల్లో ఏపీఓ రామారావు, ఎస్సార్పీ వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

గురజాల : రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు కేవీ అన్నారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ప్రతి రైతు నష్టాలు రాకుండా లాభదాయకంగా వ్యవసాయం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో 11 ట్రాక్టర్లను సబ్సిడీపై రైతులకు అందించారు. అదేవిధంగా పనిముట్లను సబ్సిడీపై అందించడం జరిగిందన్నారు. ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ షేక్ బడేజానీ, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మురళీ, ఏఓ ఎం.సంధ్యారాణి, రైతులు తదితరులున్నారు.

డ్వాక్రా రుణాలు త్వరగా చెల్లించేలా చూడాలి

డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్

మాచవరం: డ్వాక్రా రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రుణాలు తిరిగి చెల్లింపులలో మండలం చాలా వెనుకబడి ఉందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది, యానిమేటర్లు గ్రూపుల సభ్యులకు అవగాహనా కల్పించి, ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జగనన్న చేదోడు పథకం ద్వారా అందించే రుణాలు క్షేత్రస్థాయిలో యానిమేటర్లు త్వరగా సిఫార్సులు పంపితే, మండల స్థాయి అధికారులు, బ్యాంకర్లకు అందజేసి, రుణాలు అందేలా చూస్తారన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది జాప్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో స్త్రీ నిధి ద్వారా రుణ సౌకర్యానికి ఎంతో అవకాశం ఉందని, అర్హులైన వారిని గుర్తించి రుణాలు అందించాలని తెలిపారు. మహిళా సాధికారితకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. సమావేశంలో ఏపీఎం రామారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

పేద కళాకారులకు పింఛన్లు అందజేయాలి

మాచర్ల: రాష్ట్రంలో కళాకారులందరికి న్యాయం జరిగేందుకు జాతీయ బహుజన కళాకారుల రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టిపాలెం వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి కళాకారులందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. డప్పు కళాకారులు, చర్మకారులు, నాటక, రంగస్థల కళాకారులను గుర్తించి, విచారించి అర్హులకు పింఛన్‌లు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కళాకారులు, డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేస్తున్నా.. అర్హులైన పలువురికి ఇంకా అందడం లేదన్నారు. అర్హత కలిగిన కళాకారులకు గుర్తింపు పొందిన సంఘం ద్వారా ధ్రువీకరించిన వారికి పింఛన్ మంజూరు చేయాలన్నారు. లేకపోతే ఎవరికి వారు కళాకారులమని చెప్పి దుర్వినియోగం చేసే అవకాశముందన్నారు. కంభంపాటి దానం, బూడిద లక్ష్మయ్య, రమావత్ మాంగూబాయి, వడితె తిరుపతినాయక్, కేతావత్ దేవీబాయి, ఆదిరాల సుందర రావు, కోళ్ల పేతురు తదితరులున్నారు.

జగనన్న నాలుగేళ్ల పాలన దేశానికే ఆదర్శం

శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

వినుకొండ(నూజెండ్ల) : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలన దేశానికి ఆదర్శమని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అన్నారు. వినుకొండలో కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న ఆయన స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు కులం, మతం, ప్రాంతం బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేశారని, కరోనా సమయంలో ప్రపంచమే వణికిపోతున్న సమయంలో కూడా రెండేళ్ల పాటు ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని ఆయన అభినందించారు. వినుకొండకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం చేయడంతో పాటు రామలింగేశ్వర స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు నిర్మాణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి భేష్‌గా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా స్పీకర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సివిల్స్‌లో స్థానం

- కలెక్టర్ లోతేటి శివశంకర్
- సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన
- జెడ్డావారి పాలెంలో పర్యటన



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

వినుకొండ(నూజెండ్ల): ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే సివిల్స్‌లో స్థానం సంపాదించవచ్చని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. నూజెండ్ల మండలం జెడ్డావారిపాలెం గ్రామంలో పారా లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నిర్వాహకులు పారా లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఇటీవల యూపీఎస్సీలో 462 ర్యాంక్ సాధించి ఐఏఎస్ కు సెలక్ట్ అయిన వినూత్న అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శివశంక్ పాల్గొని వినూత్నను అభినందించారు. స్టడీ సర్కిల్ నిర్వాహకులు పారా లక్ష్మయ్యకు కూడా అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఢిల్లీ, హైదరాబాద్‌ల్లో స్టడీసర్కిల్ ద్వారా ఎంతోమందిని ఐఏఎస్ లను తయారు చేసిన లక్ష్మయ్య కృషి ఎనలేనిదన్నారు. గ్రామంలో సమస్యల అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ విద్య

సత్తెనపల్లి: తల్లిదండ్రులను కోల్పోయిన లేదా తల్లి లేదా తండ్రి కోల్పోయిన విద్యార్థులకు అత్యుత్తమ బోధనా సిబ్బందితో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యను ప్రగతి విద్యాసంస్థలు పూర్తి ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉందని ఆ సంస్థ డైరెక్టర్ పరిటాల నరేష్ మంగళవారం తెలిపారు. ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9966511424 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణలో భాగంగా దాతల సహకారంతో మంగళవారం 40 మంది పేదలు, వృద్ధులు, యాచకులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. చెర్రీస్ న్యూట్రీషన్ సెంటర్ వారి సౌజన్యంతో వేల్పూరి నరసింహారావు, మాధవిల కుమార్తె చరిష్మా ఆర్థికసాయంతో వారి చేతులమీదుగా భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీదేవి జన్మదినోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని 6వ వార్డు నందు గల ఫిరోజీ రుషిందుల వారి మఠంలో వెంచేసి ఉన్న వేదమాత గాయత్రి దేవి ఆలయంలో మంగళవారం గాయత్రి అమ్మవారి జన్మదినం శుభ సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ దశమి సందర్భంగా ఉదయం నుంచి మేళ తాళాలతో జన్మదిన మహోత్సవ కార్యక్రమాలు, పంచామృతాభిషేకం, కలశాభిషేకం, విశేష పూజలు, విశేష అర్చన చేపట్టారు. అచ్చంపేట రోడ్ లోని శివాలయం నుంచి మేళతాళాలతో అభిషేక జలాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి అభిషేకం, తదుపరి విశేషాలంకరణ నిర్వహించారు. వేదమాత గాయత్రి అమ్మవారి భక్త సమాజం, ఛత్రపతి శివాజీ యూత్, శ్రీ భక్తాంజనేయ స్వామి భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.